

తెలంగాణ రాష్ట్ర 2023-24 వార్షిక బడ్జెట్‌ను సోమవారం ప్రవేశ పెట్టిన సందర్భంలో ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్ రావుకు అసెంబ్లీలో అభినందనలు తెలుపుతున్న కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా మంగళవారం మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శేఖర్‌రెడ్డి తెలిపారు. రాజబొల్లారం పరిధిలోని అన్ని ఫీడర్లకు, పరిశ్రమలకు, అగ్రికల్చర్, డొమెస్టిక్, పారిశ్రామిక సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నేడు మంత్రి రాక

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ 6వ వార్డు కుందన్‌పల్లిలోని ప్రజయ్‌సాయి గార్డెన్‌లో సుమారు రూ.1.88 కోట్ల నిధులతో చేపట్టనున్న పార్కు డెవలప్‌మెంట్ పనులతో పాటు 13వ వార్డులో రూ.23 లక్షల హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టనున్న చెరువు బండ్ బ్యూటిఫికేషన్ పనులను ప్రారంభించేందుకు మంత్రి చామకూర మల్లారెడ్డి మంగళవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీకి విచ్చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ప్రణీతాగౌడ్, కమిషనర్ స్వామిలు తెలిపారు.

49 దరఖాస్తులకు ఆమోదం

మేడ్చల్: ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు జీఓ 59 కింద మండల తహసీల్దార్ కార్యాలయం దరఖాస్తు చేసుకున్న 49 దరఖాస్తుదారులకు ఆమోదం తెలిపినట్లు తహసీల్దార్ సరిత తెలిపారు. ఆమోదం పొందిన వారికి డబ్బులు, చెల్లించడానికి నోటీసులు జారీ చేశామని ఆమె తెలిపారు. పేమెంట్ పూర్తయిన తర్వాత రిజిస్ట్రేషన్లు చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా...


గౌడవెల్లి గుడిబండలో అష్టోత్తర శివలింగాల ప్రతిష్ఠ



ఆలయానికి చేరుకున్న 108 శివలింగాలు

మేడ్చల్: మండలంలోని పురాతన ఆలయాల్లో ఒక్కటైన గౌడవెల్లి గుడిబండ శివాలయంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు అష్టోత్తర(108) శివలింగాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు అప్పంగారి రాంరెడ్డి తెలిపారు. ఎక్కడా లేని విధంగా గౌడవెల్లి ఆలయంలో నవ ద్వాదశ జ్యోతిర్లింగాలతో అష్టోత్తర శతలింగాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

'శాంతా'లో స్థానికులకు అవకాశమివ్వాలి



వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్ దేవ

మేడ్చల్: మూత పడుతున్న అత్వెల్లి శాంతా బయోటెక్ కంపెనీలో మిషనరీ వర్క్స్ కోసం స్థానికులకు అవకాశమివ్వాలని కౌన్సిలర్ దేవ కంపెనీ హెచ్‌ఆర్ మల్లేశంను కోరాడు. ఈ మేరకు కంపెనీలో మల్లేశంకు ఆయన వినతి పత్రం ఇచ్చాడు.

ఘనంగా మల్లన్న జాతర

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలో మల్లన్న జాతర ఘనంగా జరిగింది. ఒగ్గు పూజారులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు స్వామివారికి బోనాలు సమర్పించగా యువకులు బండ్లు ఊరేగించారు. గ్రామస్తులతో పలు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున జాతరలో పాల్గొన్నారు. ఒగ్గు కళాకారుల డోలు సప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో గ్రామం మల్లన్న నామస్మరణతో మార్మోగింది.

అసమ్మతి కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు బుజ్జగింపులు!

దారికి తెచ్చుకునే పనిలో జిల్లా బీఆర్‌ఎస్ పెద్దలు

ఆదిలోనే చల్లార్చేందుకు మంతనాలు

రంగలోకి మంత్రి, ఎమ్మెల్సీ, పార్టీ ప్రధాన నేతలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఒక్కో పురపాలికల్లో చెలరేగుతున్న అవిశ్వాస జ్వాలలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఒక్కొక్కటిగా పురపాలికల్లో అవిశ్వాస జ్వాలలు ఎగిసి పడుతున్నాయి. వీటిని ఆదిలోనే చల్లార్చేలా బీఆర్‌ఎస్ కీలక నేతలు తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నారు. అవిశ్వాస నోటీసు ఇవ్వడానికి ఇప్పటి వరకు గడువు మూడేళ్లుగా ఉంది. దీనిని నాలుగేళ్లకు పెంచాలంటూ గత శాసనసభ సమావేశాల్లోనే సవరణ బిల్లును ప్రతిపాదించి ఆమోదించారు. ఆ తర్వాత గవర్నర్ సంతకానికి పంపారు. రెండు, మూడు రోజుల్లో సంతకం పెట్టేస్తారని, ఇలా అవిశ్వాసాల పేరిట ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండదంటూ కొందరు బీఆర్‌ఎస్ నాయకులు ముఖ్యంగా మంత్రి, పలువురు మేయర్లు, చైర్మన్లు.. వ్యతిరేక శిబిరాలకు చేరుతున్న కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు నచ్చచెబుతున్నారు. అంతా కలిసి మెలిసి పురపాలికల్లో పాలన సవ్యంగా సాగేలా చూడాలని హితవు పలుకుతున్నారు. ఎవరైనా అవిశ్వాసం నోటీసు ఇస్తే ఆ పూర్తి వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగానికి మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. దీంతో అవిశ్వాస నోటీసులు ఇచ్చిన పాలకవర్గాన్ని సమావేశపర్చేలా కలెక్టరు తేదీ ప్రకటించే అవకాశం ఉండదని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కార్పొరేటర్ల, కౌన్సిలర్లకు వివరిస్తున్నారు. ప్రస్తుతం పురపాలికల్లో మేయరు, డిప్యూటీ మేయరు, చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాల్లో ఉన్న వారు.. ఇవే అంశాలను పరిగణలోకి తీసుకుంటూ తమకేం కాదనే దీమా వ్యక్తం చేస్తున్నారు. వ్యతిరేక శిబిరంలో ఉన్న వారిలో ఈ వివరాలు పంచుకుంటూ వారిని మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎలాగూ కొత్త సవరణ బిల్లు వచ్చేస్తోంది.. గడువు నాలుగేళ్లకు పెరుగుతుంది... ఎందుకు అనవసరంగా వారితో వెళ్లి ఇబ్బందులు ప డతారు.. నాకు మద్దతుగా ఉండండి... మీకు మేలు జరిగేలా చూస్తానంటూ... ఇటీవల ఒక పురపాలికకు చెందిన మేయరు బంధువు 'అవిశ్వాస' బృందంలోని కొందరు కార్పొరేటర్లకు స్ప ష్టం చేయటంతో పాటు ఆఫర్ కూడా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరికొందరు అయితే ముందు జాగ్రత్త కోసం అవసరమైన సభ్యుల మద్దతు కూడ గట్టుకునే పనిలో నిమగ్నం కావటంతో పాటు మచ్చిక చేసుకునేందుకు ఆఫర్లు కూడా ప్రకటించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బోడుప్పల్, నాగారం, గుండ్లపోచంపల్లి, తూ ముకుంట, కొంపెల్లితో సహా పలు పురపాలికల్లో అవిశ్వా స తీర్మానంపై కలెక్టర్‌కు నోటీసు ఇస్తారని ప్రచారం జరిగింది. కొందరు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు అందు కోసం అన్నీ సిద్ధం చేసుకు న్నారు. ఈ విషయం తెలియడంతో పలువురు మేయర్లు, చైర్మన్ల ఒత్తిడి మేరకు బీఆర్‌ఎస్ నేతలు, పలువురు

సర్దుబాటులో బీఆర్‌ఎస్ నేతలు..

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు రంగంలోకి దిగడంతో పాటు అవిశ్వాస తీర్మానం అయ్యే పని కాదంటూ నచ్చజెప్పుతున్నట్లు తెలుస్తోంది. అలాగే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు రంగ ప్రవేశంతో కొంత సద్దుమణిగినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో పలు పురపాలకల్లోని సభ్యులు తమ ఆలోచనను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే, మరికొందరు కోర్టును ఆశ్రయించే విషయంపై సమాలోచనలు జరుపుతున్నట్లు సమాచారం.

జవహర్‌నగర్ బాటలోనే...

జవహర్‌నగర్ నగరపాలక సంస్థ మేయర్ మేకల కావ్యపై సొంత పార్టీకి చెందిన 20 మంది కార్పొరేటర్లు జనవరి 31న జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందజేశారు. ఆ వెంటనే నాలుగు రోజుల పాటు కార్పొరేటర్లు క్యాంపు బాట పట్టారు. శిబిరాలకు వెళ్లిన అసంతృప్తి కార్పొరేటర్లతో బీఆర్‌ఎస్ నేతలు మంతనాలు జరపడంతో మూడు రోజుల వ్యవధిలోనే ఇంటి ముఖం పట్టారు. అయితే వీరి డిమాండ్లకు సంతృప్తికరమైన హామీ లభించకపోవడంతో మరోసారి కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానంపై నోటీసు అందజేశారు. అలాగే మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ మర్రి దీపికపై బీఆర్‌ఎస్‌కు చెందిన 15 మంది అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానానికి సంబంధించిన నోటీసు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమర్పించారు. తదుపరి దమ్మాయిగూడ పురపాలికకు చెందిన 11 మంది బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లతో పాటు మరో ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ ప్రణీతపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. ఈ నోటీసుపై సంతకం చేసిన వారిలో 1, 2, 3, 4, 5, 17, 7, 8, 10, 12, 18, 16, 9, 6 వార్డులకు చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్ 2019 సెక్షన్ 37 అనుసరించి అవిశ్వాసం తీర్మానం పురపాలక సంఘాల్లో మేయర్/చైర్మన్ సమర్పిస్తున్నట్లు వారు నోటీసులో పేర్కొంటున్నారు. జిల్లాలో పలు పురపాలక సంఘాల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన అసమ్మతి కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసులు కలెక్టర్‌కు సమర్పించేందుకు సన్నద్ధమవుతున్నారు.

'బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం'



రాయిలాపూర్‌లో మాట్లాడుతున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: నియోజకవర్గంలోని ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఎండగడతామని పీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. పీసీసీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్ర స్ఫూర్తిగా మేడ్చల్ నియోజకవర్గంలో యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యాత్ర విజయవంతం కావాలని కోరుతూ గౌడవెల్లి గుడిబండ శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి గౌడవెల్లి నుంచి రాయిలాపూర్ వరకు యాత్ర నిర్వహించి రాయిలాపూర్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇచ్చారు. రాయిలాపూర్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో మేడ్చల్ నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిపోయిందని, పేద పిల్లలు చదువుకోవడానికి కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకుండా పోయిందని అన్నారు. పట్టణాల్లో ఎన్నో సమస్యలు తాండవం చేస్తున్నాయని, అనుమతులు రాగానే మేడ్చల్‌లో జోడో యాత్ర ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, నాయకులు మహేష్‌గౌడ్, పోచయ్య, బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, రమణారెడ్డి, రాహుల్ యాదవ్, రవి, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, గీతారెడ్డి, పద్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొంపల్లి మోహన్‌రెడ్డి

కీసర: రాష్ట్రంలో కుటుంబ పాలన అంతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి మోహన్‌రెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నిర్వహించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రూరల్ బీజేపీ కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయ వనరుల్లో మెజారిటీ వాటాను అందిస్తున్న దాదాపు 50 లక్షల జనాభా ఉన్న జిల్లా ప్రజలకు ఇక్కడి సమస్యలతో జీవించడం కష్టమైందన్నారు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే జిల్లాకు చెందిన మంత్రి మల్లారెడ్డి ఓ అసమర్థుడని, సమస్యలను పరిష్కంచాలని ప్రజలు కోరుతుంటే మంత్రి కాలయాపన చేస్తున్నాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి, జిల్లాలో మంత్రి మల్లారెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ అసమర్థ పాలనను, కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 10 నుంచి 25వ తేదీ వరకు స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌ల పేరిట ప్రతి గ్రామంలో మూడు బూత్‌లకు ఒక చోట బీజేపీ ఆధ్వర్యంలో సమావేశాలు పెట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, డాక్టర్ మల్లారెడ్డి, నాయకులు జిల్లాల తిరుమల్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, వేణుగోపాల్, నాగ మల్లారెడ్డి, సురేష్, నరేష్, రవీందర్ పాల్గొన్నారు.

'మహిళల సాధికారతకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం'



సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్ దివ్య నల్లా

ఘట్‌కేసర్: మహిళల సాధికారత కోసం విద్యార్థినులకు సాంకేతిక నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ దివ్య నల్లా అన్నారు. కాచవానిసింగారం నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'అమెజాన్ వెబ్ సర్వీసెస్'పై సోమవారం నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. దివ్య మాట్లాడుతూ.. మహిళ సాధికారతలో భా గంగా సుప్రసిద్ధ 'ఎడ్యుస్కిల్స్'తో ఒప్పందం చేసుకున్నామని, అమెజాన్ సంస్థ ద్వారా క్లౌడ్ టెక్నాలజీలో తెలంగాణ, ఏపీలోని 500 మంది విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశం కల్పిస్తున్నామన్నారు. కళాశాల కంప్యూటర్ ల్యాబ్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తామన్నారు. ఈ సదస్సులో అమెజాన్ ప్రతినిధి రాజ్ చిలకపాటి, వివేక్‌రంజన్, పవన్‌కుమార్, టెక్నికల్ ట్రైనర్స్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ప్రొ.ప్రవీణ్‌కుమార్

కాలానికి అనుగుణంగా బోధనా పద్ధతుల్లో మార్పు రావాలి

మేడ్చల్‌రూరల్: వేగంగా మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అధ్యాపకులు మెరుగైన శిక్షణ పొంది తమ బోధన పద్ధతుల్లో మార్పు తేవాలని ఐఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, ఐఐటీ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్, ఈఎఫ్ఎల్‌యూ ప్రొఫెసర్ శ్రీహరిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా ప్రాక్టికల్ నాలెడ్జ్, ఆధునిక పరిజ్ఞానం పొందవచ్చన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో వేతనాలు అందజేత



వేతనాలు అందజేస్తున్న సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి దంపతులు

ఘట్‌కేసర్: అవుషాపూర్ సర్కారు బడిలో విద్యార్థులకు బోధించడానికి సరిపోను ఉపాధ్యాయులు లేరన్న హెచ్‌ఎం రవి విన్నపం మేరకు సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి దంపతులు ముగ్గురు ప్రైవేటు ఉపాధ్యాయులను నియమించారు. వీరికి డిసెంబర్, జనవరి నెలల వేతనా లు తమ సొంత డబ్బులు రూ.30 వేలు సోమవారం అందజేశారు.

అంధత్వ నివారణకు కంటి వెలుగు దోహదం



ఘట్‌కేసర్‌లో కంటి వెలుగును పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అంధత్వ నివారణకు కంటి వెలుగు కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందని చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని ఐదో వార్డులో కమిషనర్ వేమన రెడ్డి, కౌన్సిలర్ అనురాధతో కలిసి సోమవా రం కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు ఫణిందర్‌రెడ్డి, విమల, శిరీష పాల్గొన్నారు.

కొర్రెముల్‌లో... కంటి వెలుగును సోమవారం ఉప సర్పంచ్ రాజుముదిరాజ్‌తో కలిసి సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వినోద, మెడికల్ ఆఫీసర్ పద్మ, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మ, కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

నాగారం, దమ్మాయిగూడలో...

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో కంటివెలుగు కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సోమవారం నాగారం మున్సిపాలిటీ 2, 3వ వార్డుకు సంబంధించి రాంపల్లి వార్డు ఆఫీసులో నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో 110 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 57 మందికి రీడింగ్ అద్దాలు, 6 మందికి పర్మినెంట్ అద్దాలు, మరో 14 మందికి కంటి ఆపరేషన్లు అవసరమన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో 122 మందికి కంటి పరీక్షలు చేసి 14 మందికి కంటి అద్దాలు అందజేశారు. ఆరుగురికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు.

జగ్గంగూడ గ్రామంలో...

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పద్మ, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కల్పిస్తాం



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావ్య

జవహర్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి సరైన రక్షణ కల్పిస్తామని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. సోమవారం అంబేడ్కర్ నగర్‌లోని ప్రైమరీ పాఠశాలలో కార్పొరేటర్ ఏకే మురుగేష్ ఆధ్వర్యంలో ప్రైమరీ పాఠశాలకు రూ.5లక్షల వ్యయంతో చేపట్టే ప్రహరీ రక్షణ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, డివిజన్ అధ్యక్షుడు ఆనంద్, శంకర్, రమేష్, రాములు, యూత్ నాయకులు మహేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం..

కార్పొరేషన్‌లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. సోమవారం 27వ డివిజన్ బక్తబాయ్‌కాలనీలో కార్పొరేటర్ జిట్ట శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రూ.5లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టు ఆశాకుమారి, కోఆప్షన్ సభ్యురాలు శ్వేతాముఖేష్, శోబారెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండల్‌ముదిరాజ్, 7వ డివిజన్ అధ్యక్షుడు మెట్టు వెంకన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేసి నూతన కలెక్టర్ అమయ్ కుమార్‌కు స్వాగతం, బదిలీపై వెళ్లిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్‌కు వీడ్కోలు పలికారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, మేయర్లు జక్క వెంకట్‌రెడ్డి, చైర్మన్ కొండల్‌రెడ్డి, డీఆర్‌ఓ లింగ్యానాయక్, ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్, ఆర్‌డీఓలు రవి, మల్లయ్య, జడ్పీటీసీ, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. - సాక్షి, మేడ్చల్ జిల్లా

ఘనంగా శివపార్వతుల ఊరేగింపు

మేడ్చల్: నూతన ఆలయ నిర్మాణం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో దేవతామూర్తుల మూల విగ్రహాలను గ్రామంలో వైభవంగా ఊరేగించారు. వేంకటేశ్వర ఆలయ ప్రాంగణం నుంచి గ్రామ వీధుల్లో భాజాభజంత్రీలతో ఊరేగించారు. వేడుకలో కౌన్సిలర్లు సరిత మల్లేష్‌గౌడ్, మానస శ్రవణ్‌కుమార్ గుప్తా, నాయకులు ఈశ్వరయ్య, శివమాల ధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనంను పరిశీలిస్తున్న పావని

ఘట్‌కేసర్: ప్రభుత్వ నియమానుసారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని శివారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలను స్థానిక కౌన్సిలర్ అనురాధతో కలిసి సోమవారం పావనీయాదవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటుకు దీటుగా పేద విద్యార్థులను తీర్చిదిద్దడానికి సర్కారు బడుల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంజిరెడ్డి, జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

'సీఎంఆర్'లో ప్రాజెక్ట్ ఎక్స్‌పో

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సీఎంఆర్ సెట్ కళాశాలలో బీటూబీ పేరిట సామాజిక ఆవిష్కరణలపై ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమాన్ని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. 109 జట్లు పాల్గొనగా వారిలో 54 జట్లను ఎంపిక చేసి ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 3 జట్లకు సీఈఓ అభినవ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ నగదు బహుమతితో పాటు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునుడి కల్యాణం

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లిలో శ్రీ కేతకి భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి, శ్రీఛాయాంజనేయ స్వామి వార్ల దేవాలయ 67వ వార్షికోత్సవంతో పాటు భ్రమరాంబ, మల్లికార్జున దేవతామూర్తుల కల్యాణోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.



కల్యాణోత్సవంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

క్రైం కార్నర్..

ఉరి వేసుకొని కూలీ ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఉరి వేసుకొని ఓ కూలీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాలు ప్రకారం... ఏపీలోని ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఇంతముక్కల గ్రామానికి చెందిన నర్సింహ(40) ఘట్‌కేసర్‌కు వలస వచ్చి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో కుటుంబంతో నివాసముంటున్నాడు. కాగా ఆదివారం రాత్రి పని ముగించుకుని ఇంటికొచ్చి గదిలోకి వెళ్లగా అతడి భార్య, పిల్లలు బయట ఉన్నారు. అరగంట తర్వాత లోపలికెళ్లి పరిశీలించగా కిటికీకి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కడుపు నొప్పి కారణంగా భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఘట్‌కేసర్: పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారంతో ఎదులాబాద్‌లోని గోపాల్‌రెడ్డి బావి దగ్గర పేకాటాడుతున్న ఉప్పల్ గాంధీనగర్‌కు చెందిన మహేశ్‌కుమార్(28), స్వరూప్‌నగర్‌కు చెందిన సుంకు రాజశేఖర్‌రెడ్డి(40), ఈస్ట్ కల్యాణ్‌పురికి చెందిన రామిశెట్టి పవన్‌కుమార్(57), భరత్‌నగర్‌కు చెందిన కస్తూరి నాగేశ్(38), మధు(48)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 4 సెల్ ఫోన్లు, రూ.24,770ల నగదు, 6 పేకాట సెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ సిబ్బందిపై.. నలుగురి దాడి

జవహర్‌నగర్: ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న వారిపై నలుగురు వ్యక్తు లు దాడి చేసిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పో లీసుల వివరాల ప్రకారం.. యాప్రాల్ లో శ్రీకాంత్ అనే వ్యక్తి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇందులో సో యా, ఆమె భర్త వికాస్‌తో పాటు వివే క్‌లు పనిచేస్తున్నారు. ఈ నెల 3వ తేదీ రాత్రి 10 గంటలకు నలుగురు వ్యక్తు లు ఆకాష్, వివేక్, కల్యాణ్, అమూల్‌రాజ్‌లు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వచ్చి ఆ ర్డర్ ఇచ్చి పార్శిల్ చేయాలన్నారు. అ క్కడ పనిచేస్తున్న సోయా ఫాస్ట్‌ఫుడ్‌తో పాటు ప్లాస్టిక్ ప్లేట్లు ఇవ్వడంతో ఆ న లుగురు వ్యక్తులు స్టీల్ ప్లేట్స్ ఇవ్వా లని చెప్పారు. దీంతో సెంటర్‌లో పనిచేస్తున్న వారు నిరాకరించడంతో ఆగ్ర హించిన నలుగురు సెంటర్‌లో పనిచేస్తున్న సోయా, వికాస్, వివేక్‌లపై గొ డవకు దిగి రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో సోయా తలకు గాయం కా గా.. వివేక్, వికాస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.